S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.
ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 235 ఎడిటర్ : విక్రం కుమార్ ఆదివారం 04 మే 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

## పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత..
# ప్రధాని మోదీతో మొదటిసారి ఒమర్ అబ్దుల్లా భేటీ

- ప్రధాని మోదీతో అరగంట పాటు ఒమర్ అబ్దుల్లా భేటీ
- శనివారం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో సమావేశం
- పహల్గామ్ ఉగ్రదాడి సహా పలు అంశాలపై సంప్రదింపులు

**మే 3, సమయం న్యూస్,** జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి అధికారిక నివాసంలో వీరిద్దరి మధ్య భేటీ జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశం సుమారు 30 నిమిషాల పాటు కొనసాగింది. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడితో సహా పలు కీలక అంశాలపై ప్రధానమంత్రి మోదీ, ఒమర్ అబ్దుల్లా చర్చించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఈ దాడి ఘటన అనంతరం నెలకొన్న పరిస్థితులు, భద్రతాపరమైన అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. గత నెల 22వ తేదీన పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ విషాద సంఘటన తర్వాత ప్రధానమంత్రి మోదీ, ఒమర్ అబ్దుల్లా నేరుగా సమావేశం కావడం ఇదే మొదటిసారి.



# మరో రూ.300 కోట్ల పెట్టుబడులు!

- ముందుకొచ్చిన సిరా నెట్‌వర్క్, ఎల్‌సీజీసీ రెజల్యూట్ సంస్థలు
- మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశం



**మే 3, సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలో రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు టెలికం ఉత్పత్తుల సంస్థలైన సిరా నెట్‌వర్క్ (తైవాన్), ఎల్‌సీజీసీ రెజల్యూట్ గ్రూప్ (తెలంగాణ) సంయుక్తంగా ముందుకు వచ్చాయి. ఈ సంస్థల ప్రతినిధులు శనివారం సచివాలయంలో ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పది ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ ద్వారా 2500 మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఇందులో 5జీ నెట్‌వర్క్, మల్టీలేయర్ నెట్‌వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్లు

తరువాయి 2లో



## మూసీని మూసేస్తుంటే..
# కళ్లు మూసుకున్నారు

- యథేచ్ఛగా ఉల్లంఘనలు.. షరతులు హుష్‌కాకి...
- నది ఒడ్డునే 38 అంతస్తుల భారీ నిర్మాణం

**మే 3, సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళనకు ప్రత్యేకంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను 2017లో ఏర్పాటు చేసింది. నది బఫర్ జోన్ పరిధిలో 50 మీటర్ల వరకు, ఆ తర్వాత 100 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలకు అనుమతించకూడదని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే నిర్మించిన దాదాపు 15వేల కట్టడాలను తొలగించాలనే ప్రతిపాదన ఉంది. కొత్తగా అనుమతులు ఇవ్వకూడదు. కానీ ఈ భవంతి నిర్మిస్తున్న పరిస్థితుల్లో మూసీ ప్రక్షాళన సాధ్యమవుతుందా అనే ప్రశ్న వ్యక్తమవుతోంది. అనుమతుల జారీలో హెచ్ఎండీఏలో భారీగా సొమ్ములు చేతులు మారి ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది.

తరువాయి 2లో

## అల్బనీస్‌కే ..
# మళ్లీ పట్టం

- మరో మూడేళ్లు ఆస్ట్రేలియా ప్రధానిగా ఆయనే

మెల్‌బోర్న్, దిల్లీ: ఆస్ట్రేలియా ఎన్నికల్లో ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ నేతృత్వంలోని మధ్యేవాద వామపక్ష లేబర్ పార్టీ మరోసారి విజయం దిశగా దూసుకుపోతోంది. దీంతో మరో మూడేళ్లపాటు ఆయనే ప్రధానిగా కొనసాగనున్నారు. 21 ఏళ్ల తర్వాత వరుసగా రెండోసారి గెలిచిన నేతగా

తరువాయి 2లో







# 3 ఏళ్లలో అమరావతి నిర్మాణాలు పూర్తిచేయాలి


- మంత్రులు, కూటమి ప్రజాప్రతినిధులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- ప్రజల భాగస్వామ్యంతో సభ విజయవంతమైందన్న సీఎం
- మోదీ ప్రసంగం భవిష్యత్తు రాజధానిని ఆవిష్కరించిందని వ్యాఖ్య

**మే 3, సమయం న్యూస్, అమరావతి:** మూడేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణ పనులను పూర్తిచేసి, ఘనంగా ప్రారంభోత్సవాలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఇక అంతా మీ చేతుల్లోనే ఉందంటూ పురపాలక శాఖ మంత్రి నారాయణకు లక్ష్యాన్ని నిర్దేశించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు పనులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా సీఎంకు నారాయణ తెలిపారు. ప్రధాని సభ విజయవంతమైన నేపథ్యంలో కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో శనివారం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'అమరావతి ఒక నగరం కాదు.. అధునాతన శక్తిగా మారుతుంది' అంటూ అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం స్ఫూర్తి నింపిందని తెలిపారు. రాష్ట్ర వృద్ధిరేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందన్న ప్రధాని వ్యాఖ్యలు భవిష్యత్తు రాజధానిని ఆవిష్కరించాయని పేర్కొన్నారు. ప్రజా రాజధానికి ఆయన భరోసా

తరువాయి 2లో

# ఉగ్రవాదులు నిఘా వర్గాల్ని ఏమార్చారా?


- వేరే ప్రాంతంలో దాడి అంటూ సమాచారం
- భద్రతా దళాలు అక్కడ నిఘా పెంచగా బైసరన్‌లో దాడి



**మే 3, సమయం న్యూస్, దిల్లీ:** పహల్గాం దాడికి ముందు ఉగ్రవాదులు నిఘా వర్గాలను ఏమార్చారా.. అంటే అవుననే అధికార వర్గాలు అందిస్తున్న సమాచారం సూచిస్తోంది. శ్రీనగర్ శివారులో జబర్వాన్ కొండ ప్రాంతాల్లోని హోటళ్లలో బస చేసిన పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయనున్నారని పహల్గాం దాడికి కొన్ని రోజుల ముందు నిఘా వర్గాలకు సమాచారం అందిందని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. దాచిగామ్,

తరువాయి 2లో

# పాకిస్థాన్‌పై మరిన్ని ఆంక్షలు



2లో

- దిగుమతులు, నౌకలపై నిషేధం విధించిన భారత్
- ఉత్తరాలు, పార్సిల్ సేవలూ నిలిపివేత
- అబ్దాలీ క్షిపణుల్ని పరీక్షించిన పాక్

# మూసీని మూసేస్తుంటే.. కళ్లు మూసుకున్నారు

(మొదటిపేజీ తరువాయి)

దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ అడిగితే న్యాయస్థానం ఆదేశాల ప్రకారం నిర్మాణం కొనసాగిస్తున్నారని చెబుతున్నారే తప్ప.. షరతులు పాటించని విషయంపై మాట్లాడడం లేదు.

**వివాదాల మధ్య..**

ఈ భవంతిని 9.19 ఎకరాల విస్తీర్ణంలోని పట్టాభూమిలో రెండు సెల్లార్లు, నాలుగు బ్లాక్‌లు, ఒక గ్రౌండ్ ఫ్లోర్, 38 అంతస్తులతో నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం బఫర్ జోన్ వదులుతున్నట్లు, అన్ని రకాల నిబంధనలు పాటిస్తున్నట్లు దరఖాస్తు చేయడంతో క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే అన్ని స్థాయిల అధికారులు అనుమతులు ఇచ్చేశారు. మూసీ నది ఆక్రమణపై ఫిర్యాదులు రావడంతో భవన నిర్మాణ అనుమతులు రద్దు చేస్తామంటూ 2023 ఆగస్టులో హెచ్‌ఎండీఏ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులకు సంస్థ ఇచ్చిన వివరణపై హెచ్‌ఎండీఏ సంతృప్తి చెందలేదు. సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తర్వాత అధికారుల నుంచి నివేదికను, సంస్థ నుంచి ఓ ప్రమాణ పత్రం తీసుకున్న న్యాయస్థానం ఆ మేరకు పిటిషన్‌ను మూసివేసింది. సంస్థ మళ్లీ నిర్మాణం ప్రారంభించింది.

*** సంయుక్త కమిటీ ముఖ్య పరిశీలనాంశాలు ఇవీ...**

రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, జలవనరుల శాఖ అధికారులు 29.5.24న క్షేత్రస్థాయిలో ఈ భవంతికి సంబంధించి సంయుక్త విచారణ నిర్వహించి నివేదిక ఇచ్చారు. పట్టాభూమి 9ఎకరాల 19 గుంటల్లో నది వైపు 50 మీటర్ల వరకు బఫర్ జోన్ వదలాల్సి ఉంది. అంటే దాదాపు 3ఎకరాల 9గుంటల స్థలం బఫర్ జోన్ కింద ప్రభావానికి గురవుతుందని నివేదించారు. నదిని ఆక్రమించి నింపిన వ్యర్థాలను, నది మధ్యలో వేసిన భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని, ఒక కాంటా, మిక్సింగ్ ప్లాంటు(బాచింగ్) బఫర్ జోన్‌లో ఉన్నాయని తెలిపారు. లోలెవల్ కాజ్‌వే కూడా మట్టితో పూడిపోయినట్లు గుర్తించారు. బఫర్ జోన్ పరిధిలో కాంక్రీట్ నిర్మాణాలు చేయకూడదని పేర్కొన్నారు. అధికారులు బఫర్ జోన్ హద్దు గుర్తించాలి... అక్కడ బోర్డులు ఏర్పాటు చేయాలి... నది ప్రవాహ మట్టం గుర్తించి బోర్డు ఏర్పాటు చేయాలి అని స్పష్టం చేశారు.

**కానీ ఏం జరుగుతోంది...**

నిర్మాణ స్థలం నదిలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. మూసీ నది వెడల్పు వివిధ ప్రాంతాల్లో ఒక్కో రకంగా ఉంటుంది. కనీసం 50 మీటర్ల నుంచి 100, 200 మీటర్ల వరకు ఉంది. నిర్దేశిత ప్రాంతంలో ఎంత ఉందనేది అధికారులు స్పష్టత ఇవ్వలేదు. కానీ పట్టాభూమి 9ఎకరాల 19 గుంటలకు రేఖా చిత్రం ఇచ్చారు. ఇది నదిలోకి చొచ్చుకు వచ్చింది. అక్కడి నుంచి 50 మీటర్ల దూరం బఫర్ జోన్, 9 మీటర్లు సెట్‌బ్యాక్ వదలాలని సూచించారు. బఫర్‌జోన్ వద్ద కాంక్రీట్ గోడ తొలగించిన సంస్థ ఫెన్సింగ్ వేసింది. నిర్మాణ సామగ్రి నదిలోనే ఉంది. వెనుక వైపు మూసీ చాలా వరకు పూడిపోయింది. కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంటు, కాంటా అలాగే ఉన్నాయి. ఎక్కడా రెవెన్యూ, జలవనరుల శాఖల హెచ్చరిక బోర్డులు లేవు. పూడిపోయిన లోలెవల్ కాజ్‌వేలో మట్టిని తొలగించాలని సూచించినా జరగలేదు. బఫర్ జోన్ 50 మీటర్లనే భవన నిర్మాణ అనుమతుల్లో ఖాళీ స్థలంగా చూపించినట్లు చెబుతున్నారు.

# అల్బనీస్‌కే మళ్లీ పట్టం

(మొదటిపేజీ తరువాయి)

అల్బనీస్ నిలవనున్నారు. ప్రతిపక్ష కూటమి నేత పీటర్ డ్యూటన్ ఓటమిని అంగీకరించారు. కూటమి ఓటమితోపాటు సొంత సీటులోనూ ఆయన ఓడిపోయారు. ఓటమికి తనదే బాధ్యతని లిబరల్ పార్టీ నేత అయిన డ్యూటన్ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా ప్రతినిధుల సభలో మొత్తం 150 స్థానాలుండగా లేబర్ పార్టీ 81 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ప్రతిపక్ష కూటమి 35, ఇతరులు 13 స్థానాల్లో గెలుపునకు దగ్గరగా ఉన్నారు. మరో 21 చోట్ల ఫలితాల సరళి తెలియరాలేదు. ఇప్పటివరకూ లెక్కించిన ఓట్లలో లేబర్ పార్టీకి 55.4 శాతం ఓట్లు వచ్చాయి. మరోవైపు పలువురు మహిళలు స్విమ్ సూట్‌లో, పురుషులు కేవలం అండర్ వేర్‌తో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మోదీ శుభాకాంక్షలు: ఆస్ట్రేలియా ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన అల్బనీస్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

# ఉగ్రవాదులనే కాదు.. వంతపాడేవాళ్లనూ వదలం

**అంగోలా అధ్యక్షుడితో మోదీ**

దిల్లీ: ఉగ్రవాదులనే కాదు. వారి మద్దతుదారులనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అంగోలా అధ్యక్షుడు జువా మనువెల్ గొంజాల్వెజ్ లౌరెన్సాతో శనివారం ప్రధాని భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు పహల్గాం ఉగ్రదాడి అంశంపైనా ఇరువురు నేతలు చర్చించుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మోదీ మాట్లాడుతూ ‘‘ఉగ్రవాదం మానవాళికి అతి పెద్ద ముప్పు అన్న విషయంలో మేం ఏకాభిప్రాయంతో ఉన్నాం. పహల్గాం ఉగ్రదాడిలో మరణించినవారికి సంతాపం తెలిపినందుకు అధ్యక్షుడు లౌరెన్సా, అంగోలా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపాను’’ అని పేర్కొన్నారు. అంగోలా సైన్యం ఆధునికీకరణకు 20కోట్ల డాలర్ల రుణాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. లౌరెన్సా పర్యటన.. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు ఓ దిశను ఇవ్వడమే కాకుండా, భారత్‌ఆఫ్రికా సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు. అంతరిక్ష పరిశోధన, ఆరోగ్యం, ఎరువులు, అరుదైన ఖనిజాలు తదితర రంగాల్లోనూ కలిసి పనిచేయాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయని తెలిపారు.



# రాష్ట్రాభివృద్ధికి కేంద్రం బాటలు



*** రేపు నితిన్ గడ్కరీ చేతుల మీదుగా 26 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు**

*** కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదారులతో తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, రాష్ట్రంతో ముడిపడి ఉన్న రూ.లక్ష కోట్ల విలువైన ఐదు జాతీయ రహదారి ప్రాజెక్టులు త్వరలో అందుబాటులోకి రానున్నాయని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మే 5న కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రంలో రూ.5,416 కోట్లతో 26 ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని వెల్లడించారు. మొదట ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద, తర్వాత హైదరాబాద్ అంబర్‌పేటలో కార్యక్రమాలకు హాజరవుతారని.. రెండు చోట్ల సభల్లో పాల్గొంటారని చెప్పారు. శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ‘‘మౌలిక వసతుల కల్పనలో 2014 తర్వాత నవశకం ఆరంభమైంది. ప్రధాని మోదీ దేశం ముఖచిత్రాన్ని మార్చే దిశలో ముందుకు వెళ్తున్నారు. 2014లో రాష్ట్రంలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడు అవి 5,200 కిలోమీటర్లకు చేరుకున్నాయి. తెలంగాణలో 33 జిల్లాలు ఉండగా 32 జిల్లాలతో జాతీయ రహదారులు అనుసంధానం అయ్యేలా కేంద్ర ప్రభుత్వం రహదారులను నిర్మించింది. ఇప్పటికే అనేక జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణమయ్యాయి. రాష్ట్రానికి మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు రానున్నాయి’’ అని కిషన్‌రెడ్డి తెలిపారు.

**కులగణన మోదీ గొప్పతనం**

కులగణనపై కేంద్రమంత్రి స్పందిస్తూ.. దేశంలో మొదటిసారి కులగణన జరుగుతోందని, అది మోదీ గొప్పతనమన్నారు. తెలంగాణలో జరిగింది కులగణన కాదని, అది కేవలం కుల సర్వే అని వ్యాఖ్యానించారు. తాము కులగణనకు వ్యతిరేకం కాదని, కాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల్లో ముస్లింలను చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో కులగణన జరగకుండా కాంగ్రెస్ రోల్‌మోడల్ ఎలా అవుతుందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.

# నేడే ‘నీట్’ రాష్ట్రంలో 190 కేంద్రాల్లో పరీక్ష

హైదరాబాద్: ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం చేపట్టే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్ యూజీ 2025) ఆదివారం దేశవ్యాప్తంగా జరగనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) దీన్ని నిర్వహిస్తోంది. గతేడాది ‘నీట్’ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఈసారి పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో ‘నీట్’ 24 పట్టణాల్లో 190 కేంద్రాల్లో జరగనుంది. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 62 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 72,507 మంది రాష్ట్ర విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు రాష్ట్రంలో ‘నీట్’ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలలోపు విద్యార్థులు కేంద్రంలోకి చేరుకోవాలి. ఆ తర్వాత అనుమతించరు. గడియారాలు, బూట్లు, ఇతర గ్యాడ్జెట్లు, నిషేధిత పదార్థాలను తీసుకెళ్లకూడదు. గతేడాది రాష్ట్రంలో నీట్ దరఖాస్తులు 79,813 రాగా, ఈసారి 7,306 తగ్గడం గమనార్హం.




## మరో రూ.300 కోట్ల పెట్టుబడులు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధిత ఉత్పత్తులు తయారవుతాయన్నారు. ఈ పెట్టుబడితో ఇండో తైవాన్ మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమల్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీలో ఎలక్ట్రానిక్ సిటీ (ఈసిటీ)ని అభివృద్ధి చేయనున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. ‘‘పరిశ్రమల ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ఇబ్బంది కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకువచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తాం. వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తాం’’ అని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్, సిరానెట్‌వర్క్ ప్రతినిధులు చుయాన్, జాయ్‌భట్టాచార్య, డౌగియాస్, ఎల్‌సీజీసీ రెజల్యూట్ గ్రూప్ నుంచి రణ్వీందర్‌సింగ్, గీతాంజలి సభర్వాల్ పాల్గొన్నారు.

## 3 ఏళ్లలో అమరావతి నిర్మాణాలు పూర్తిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారని, దేశానికే అమరావతి మార్గదర్శిగా రూపొందుతుందని మోదీ అనడం గర్వకారణమని చెప్పారు. ప్రజలందరి భాగస్వామ్యం, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల కృషితో సభ విజయవంతమైందని వెల్లడించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సమన్వయంతో పనిచేశారని, ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా విధులు నిర్వర్తించిందంటూ సీఎం అభినందించారు.

**వైకాపా వారికి ఏం మాట్లాడాలో అర్థంకావడం లేదు**

చీటికీమాటికీ విమర్శలు చేసే వైకాపా వారికి మోదీ సభ విజయవంతమవ్వడంతో ఏంచేయాలో అర్థం కావడం లేదని పలువురు మంత్రులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. చంద్రబాబు స్పందిస్తూ.. అమరావతి ఆవశ్యకతను వివరించేందుకే మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల్ని పునఃప్రారంభించినట్లు వెల్లడించారు. ‘ప్రధాని ప్రసంగం రాష్ట్రాభివృద్ధి, ప్రజలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. మంత్రులు, నేతలు ఎవరి బాధ్యతల్ని వారు సక్రమంగా నిర్వర్తించారు. లక్షల మంది వచ్చినా ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. అన్ని ప్రాంతాల వారి భాగస్వామ్యంలో కార్యక్రమం ఉత్సాహంగా, ఆశావహ దృక్పథంతో జరిగింది’ అని వివరించారు. ‘ప్రజల సహకారం, కేంద్రం మద్దతు, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా.. రాష్ట్రానికి చోదకశక్తిగా నిలిచేలా.. భవిష్యత్తు నగరంగా అమరావతిని నిర్మిస్తాం. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధిస్తూ.. మాకు అండగా నిలిచిన ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం’ అని సీఎం ‘ఎక్స్’లోనూ పేర్కొన్నారు. ‘అమరావతి ఎదుగుతుంది.. ఇది దేవుడి సంకల్పం’ అని పేర్కొన్నారు. పురాణాల్లో అమరావతి ప్రస్తావన మొదలు.. శాతవాహనుల రాజధానిగా వెలుగొందిన నాటి నుంచి నేటి వరకు రాజధాని వైభవాన్ని వివరిస్తూ రూపొందించిన వీడియోను పోస్టుకు జత చేశారు.

## ఉగ్రవాదులు నిఘా వర్గాల్ని ఏమార్చారా?

(మొదటిపేజీ తీరువాయి)

నిషాత్ ప్రాంతాల్లో పోలీసు బలగాలు విస్తృతంగా కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించాయి. గత సంవత్సరం అక్టోబరులో ఉగ్ర దాడి జరిగిన గంగన్‌గిర్, సోన్‌మార్గ్ ప్రాంతాల్లో నిఘా, పహరా పెంచారు. ఆయా ప్రాంతాల్లో గత అక్టోబరులో జరిగిన ఉగ్రవాద దాడిలో ఏడుగురు మరణించారు. తమకు అందిన సమాచారం నేపథ్యంలో దాదాపు రెండు వారాలపాటు భద్రతా సిబ్బంది శ్రీనగర్ శివార్లలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆ చర్యల్ని గత నెల 22న ఆపేశారు. పహల్గాంలో ఉగ్రవాదులు అదే రోజు దాడి చేసి 26 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్నారు. కట్రా, శ్రీనగర్ మధ్య తొలి రైలును ప్రారంభించడానికి ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూకశ్మీర్‌కు వస్తున్న సందర్భంగా దాడి చేయాలని ఉగ్రవాదులు పథకం పన్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. కశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించే కట్రా రైలు మార్గం ఏర్పాటు కావడం పాకిస్థాన్‌కు ఏమాత్రం ఇష్టం లేదు. ప్రధాన మంత్రి గత నెల 19న రైలుమార్గం ప్రారంభానికి కట్రా ప్రాంతాన్ని సందర్శించాల్సి వుంది. కానీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన పర్యటన వాయిదా పడింది. ఈ రైలు మార్గం ఎప్పుడు ప్రారంభమయ్యేదీ త్వరలో ప్రకటిస్తారని అధికారులు తెలిపారు. పహల్గాం దాడిలో ఇద్దరు స్థానిక ఉగ్రవాదులు పర్యాటకుల్లో కలిసిపోయారు. తొలి కాల్పులు జరిగిన వెంటనే వారు పర్యాటకుల్ని ఆ ప్రాంతంలోని ఫుడ్‌కోర్టు వద్ద జమయ్యేలా ప్రోత్సహించారు. అక్కడ ఉన్న ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడ్డారు.

## పాకిస్థాన్‌పై మరిన్ని ఆంక్షలు

దిల్లీ: సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్‌ను దెబ్బతీసేందుకు భారత్ మరో నిర్ణయం తీసుకుంది. పొరుగు దేశంతో వాణిజ్య సంబంధాలను తెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. పాక్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తూ ‘విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్’ (డీజీఎఫ్‌టీ) కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిషేధం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొంది. జాతీయ భద్రత, ప్రజా విధానం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ నిషేధానికి ఏదైనా మినహాయింపులు కావాలంటే ప్రభుత్వ ఆమోదం తప్పనిసరని, తదుపరి ఆదేశాలిచ్చేవరకు ఆ నిర్ణయం అమల్లో ఉంటుందని పేర్కొంది. 2019లో పుల్వామా ఉగ్రదాడి తర్వాత పాక్ దిగుమతులపై 200% సుంకాన్ని కేంద్రం విధించింది. దాంతో అవి చాలావరకు తగ్గిపోయాయి. ఇతర దేశాల మీదుగా పాక్‌నుంచి వచ్చే దిగుమతుల్నీ ఇప్పుడు నిలిపివేశారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు వివిధ మార్గాల్లో వచ్చే అన్నిరకాల ఉత్తరాలు, పార్సిళ్ల రవాణాను కూడా నిలిపివేస్తున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది. అన్ని ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై ప్రభుత్వం నిషేధం విధించిన అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. పాక్ నౌకలను భారత్‌లోని ఓడరేవుల్లోకి అనుమతించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. భారతదేశ నౌకలు కూడా పాక్‌లోని రేవులకు వెళ్లడానికి వీల్లేదని ‘డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్’ (డీజీఎస్) ఆంక్షలు విధించారు. ఇవి తక్షణం అమల్లోకి వస్తాయని విడిగా విడుదలైన నోటిఫికేషన్ తెలిపింది. అరేబియా సముద్రంలో భారత నౌకాదళం యుద్ధవిన్యాసాలు చేస్తున్న దృష్ట్యా ఆ ప్రాంతంలోకి వెళ్లొద్దని వాణిజ్య నౌకలకు సూచనలు జారీ అయ్యాయి.

**మొత్తం వాణిజ్యంలో 0.1 శాతమే**

కొన్ని రకాల ఔషధ ఉత్పత్తులు, పండ్లు, సేంద్రియ రసాయనాలు, ప్లాస్టిక్స్, నూనె ఉత్పత్తులు, కొన్నిరకాల పిండి పదార్థాలు, బంక, హిమాలయన్ పింక్‌సాల్ట్, మసాలాదినుసుల వంటివి పాక్ నుంచి భారత్ దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. వీటి విలువ తక్కువే. 202425లో భారత్ నుంచి పాక్‌కు 44.76 కోట్ల డాలర్ల వస్తువులు ఎగుమతి కాగా.. అక్కడి నుంచి కేవలం 4.2 లక్షల డాలర్ల ఉత్పత్తులనే దిగుమతి చేసుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారత్ జరుపుతున్న వాణిజ్యంలో ఇది 0.1 శాతం. విలువ స్వల్పమే అయినప్పటికీ పాక్‌లో కొన్ని పరిశ్రమలు భారత్‌కు ఎగుమతులపైనే ఆధారపడుతున్నాయి.



## న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం

* మంత్రి:శ్రీధర్ బాబు

అంబర్ పేట, మే3 (సమయం న్యూస్): న్యాయవాదుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. న్యాయవాదుల భద్రత కోసం ఇటీవలే 'ప్రొటెక్షన్ యాక్ట్' చట్టం చేశామని త్వరలోనే దాన్ని అమల్లోకి తెస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాదులో నిర్వహించిన అడ్వకేట్ సొసైటీ రజతోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమం కోసం మరో 100కోట్లు కేటాయించే విషయమై సీఎం ను కోరనున్నట్లు తెలిపారు. అనారోగ్యం పాలైన, చనిపోయిన లాయర్ల కుటుంబాలకు న్యాయవాదుల సొసైటీ అండగా నిలుస్తుండడాన్ని ప్రశంసించారు. తాను కొన్ని అనివార్య పరిస్థితుల్లో రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని లేకపోతే హైకోర్టులో అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేస్తుండేవాడిని అన్నారు. ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్ జి. మధుసూదన్ రెడ్డి తో కలిసి న్యాయవాదుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. అంతకు ముందు ఆయన ఎమ్మెల్యేలతో కలిసి సొసైటీ సిల్వర్ జూబ్లీ సావనీర్ ను ఆవిష్కరించారు.



## అంబర్ పేట ఫ్లైఓవర్ ను ప్రారంభించనున్న కేంద్రమంత్రి నితిన్ ఘట్కరి

అంబర్ పేట మే 3(సమయం న్యూస్): ఈనెల 5న రోడ్డు రవాణ మరియు హైవేల శాఖమంత్రి నితిన్ ఘట్కారి అంబర్ పేటకు వస్తున్న సందర్భంగా కొత్తగా నిర్మించిన అంబర్ పేట ఫ్లైఓవర్ ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారితో కలిసి ప్రారంభించనున్నారు .నితిన్ గడ్కారీ రాకను పురస్కరించుకొని నేషనల్ హైవే అథారిటీ అధికారులు మరియు ఫ్లై ఓవర్ కాంట్రాక్టర్లతో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు. సంబంధిత అధికారులను పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.



## క్రీడాభివృద్ధికి ప్రభుత్వం మరింత కృషి

: ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

క్రీడా ప్రతినిధి, మే 3 (సమయం న్యూస్) : నూతనంగా నియమితులైన బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సలహాదారునిగా కోసరాజు లక్ష్మణ్, బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ మీడియా కో ఆర్డినేటర్ వెంకట రమణా రెడ్డిలు శనివారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి, తెలంగాణ బ్యాట్ అధ్యక్షులు దుద్దిల్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బ్యాట్మింటన్ క్రీడాభివృద్ధికి మరింత కృషి చేస్తామని, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు స్పోర్ట్స్ అకాడమీ లను క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఘట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధితో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీకి తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ యువిఎన్ బాబు తదితరులు ఉన్నారు.

## మొదటి త్రైమాసికంలో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలి

* 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించాలి
* అన్ని ఏరియాల సమీక్ష సమావేశంలో సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే3 (సమయం న్యూస్): ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తికి పూర్తిగా అనుకూలంగా ఉండే మొదటి త్రైమాసిక కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ ఏరియాల జనరల్ మేనేజర్ లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన అన్ని ఏరియాల సమీక్ష సమావేశంలో ఆయన ఉత్పత్తి బొగ్గు రవాణా తదితర అంశాలపై సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో సాధించిన బొగ్గు రవాణా 5.66 మిలియన్ టన్నులపై 2.7 శాతం వృద్ధితో ఈ ఏప్రిల్ లో 5.81 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించామని అలాగే గత ఏడాది ఏప్రిల్ నెలలో సాధించిన 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ పై 10.6 శాతం వృద్ధితో ఏప్రిల్ లో 40 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించామని ఇదే ఒరవడిని కొనసాగిస్తూ లక్ష్యాలు సాధించాలని ఛైర్మన్ సూచించారు. ఒడిశా రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పనిచేసేందుకు సూపర్వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని ఆదేశించారు. కొత్తగా నియమించబడిన ఉద్యోగులను భూగర్భ గనుల్లో పనిచేసే విధంగా పోస్టింగులు ఇవ్వాలని కోరారు. సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగినిల సంఖ్య పెరిగిన రీత్యా వీరి నిర్వహణలో నడిపించడానికి ఒక ఓపెన్ కాస్ట్ గనిని ఒక భూగర్భ గనిని ఎంపిక చేయాలని ముందుగా ఒక పూర్తి షిఫ్టును కేవలం మహిళల చేతనే నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు రవాణా నాణ్యతపై కూడా ఆయన సమీక్షించారు. నాణ్యత సరిగా లేనట్లయితే బొగ్గు అమ్మకాలు కుంటుబడతాయని వినియోగదారులు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. కనుక నాణ్యతపై కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా పూర్తి పనిగంటలు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, డైరెక్టర్(ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణరావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్(పీపీ పర్సనల్)కె.వెంకటేశ్వర్లు, జీఎం(సీపీపీ) ఎ.మనోహర్, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ చంద్ర పరిగెన్, జీఎం మార్కెటింగ్ రాజశేఖరరావు, కార్పొరేట్ జీఎంలు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

## ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

* వేసవికాలంలో జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
* వడగాలులకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి
* జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే3 (సమయం న్యూస్): ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వడ దెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తల పై వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని ఎండల్లో బయట తిరగకుండా జాగ్రత్త వహించాలని అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల మధ్యలో ఎట్టి పరిస్థితులలో ఇండ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు తెలిపారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో వడ దెబ్బలు ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎండాకాలంలో నిలిపి ఉన్న వాహనాలలో పిల్లలు పెంపుడు జంతువులను వదల వద్దని మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వంట నివారించాలని ఎండలలో పనిచేయవద్దని ఆల్కహాల్ టీ కాఫీ స్వీట్స్ చల్లని డ్రింక్స్ తీసుకోవద్దని చెప్పులు లేకుండా బయట నడవవద్దని అన్నారు. అలాగే చిన్నారులు వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని ప్రతి రోజు సరిపడ నీరు తీసుకోవాలని వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని బయటికి వెళ్ళేటప్పుడు గొడుగు లేదా టోపిని దరించాలని ద్వి చక్రవాహనాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటీతో పాటు ఓ.ఆర్.ఎస్. ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి శరీరాన్ని కాపాడు కోవచ్చన్నారు. చర్మం పై ఎర్రటి దద్దుర్లు చర్మం పొడిబారడం లాంటివి చర్మంపై వస్తున్న మార్పులను గమనించాలని అధిక శరీర ఉష్ణోగ్రత అలసట నోరు ఎండి పోవడం తలనొప్పి ఒళ్లు నొప్పులు వాంతులు జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రులలో సంప్రదించి లేదా 108కు ఫోన్ చేసి చికిత్స అవసరమైన మందులు పొందాలని అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని ఈ వేసవి కాలంలో జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ కోరారు.

## గిరిజన యువతకు వెల్డింగ్ పర్నిచర్ తయారీపై ప్రత్యేక శిక్షణ ప్రారంభం

* జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చేతుల మీదుగా ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే3(సమయం న్యూస్): గతంలో ఐ.టి.ఐ. వెల్డింగ్ ట్రేడ్ లో శిక్షణ పొంది ప్రస్తుతం వెల్డింగ్ను జీవనోపాధిగా ఎంచుకున్న జిల్లాలోని వివిధ మండలాల 20 మంది గిరిజన యువతకు రుద్రంపూర్ లోని ఐ.టి.ఐ. కాలేజీలో ఒక నెలపాటు బెడ్స్ టేబుల్స్ ఆఫీస్ చైర్స్ తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ స్కీం ద్వారా అమలు చేయబడుతోంది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు కళాశాలలు హాస్టళ్లకు అవసరమైన పర్నిచర్ను ఇప్పటివరకు ఇతర జిల్లాల నుంచి తెప్పించేవారు. ఇకపై ఈ అవసరాలను స్థానికంగా శిక్షణ పొందిన యువత ద్వారానే తీర్చే విధంగా చర్యలు తీసుకుంటాం అన్నారు. అలాగే ఇతర మండలాల్లో వెల్డింగ్ శిక్షణ పొందిన గిరిజన యువకులకు కూడా అవకాశాలు కల్పిస్తామని శిక్షణ అనంతరం వారికి టూల్ కిట్లు అవసరమైన యంత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) విద్యా చందన, ఐ.టి.ఐ. కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, స్టాఫ్ సభ్యులు ఎపియం (ఫాం)ఎల్. వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో నీట్ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలి

* జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 03 సమయం న్యూస్: జిల్లాలో నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ కొరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజీవ్ నగర్ లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల ఎసిపి ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నీట్ పరీక్ష నిర్వహణ కొరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాల, తెలంగాణ ఆదర్శ పాఠశాల రాజీవ్ నగర్, మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షకు 1 వేయి 204 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల లోగా అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. కంట్రోల్ రూమ్, పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల వద్ద 144, 163 సెక్షన్లు అమలు చేయడం జరుగుతుందని, పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని తెలిపారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాల రవాణా జరుగుతుందని, ఇందుకు గాను పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, పరీక్ష రోజున ఉదయం 9 గంటల లోపు ప్రశ్నాపత్రాలు కంట్రోల్ రూమ్ లో ఉంచాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రంలోనికి నిబంధనల ప్రకారం ఆభరణాలు, మొబైల్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరుగదని, ప్రతి అభ్యర్థిని పరిశీలించి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, మహిళా అభ్యర్థుల పరిశీలన కొరకు మహిళా సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ పత్రాల తరలింపు నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. 4 పరీక్షా కేంద్రాలలో ఒక్కొక్క పరీక్షా కేంద్రానికి ఒక ముఖ్య పర్యవేక్షకుడు, పాలనా విభాగం నుండి ఒక నోడల్ అధికారి, పోలీసుశాఖ నుండి ఒక నోడల్ అధికారిని నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షా సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని నియమించి, ఓఆర్ఎస్, అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పారిశుద్ధ్యం, త్రాగునీరు, దివ్యాంగుల కొరకు వీల్ చైర్స్ ఇతర అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. పెన్ను, పెన్సిల్, ఎరేజర్, షార్ప్నర్, వైట్నర్ మొదలగు వాటిని అనుమతించడం జరగదని, అభ్యర్థులకు అవసరమైన పెన్నులను పరీక్షా కేంద్రం లోనే అందించడం జరుగుతుందని, ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. నీట్ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి, సంబంధిత అధికారులున్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక



## పిల్లుట్లలో చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

*** అదే రోజు బండారి గంగాధర్ జన్మదిన వేడుక!!**

(సమయం న్యూస్) ,శివంపేట : శివంపేట మండల కేంద్రంలోని పిల్లుట్ల గ్రామంలో 5 వ తేదీన 11 గంటలకు చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ, అనంతరం సేవ రత్న అవార్డు గ్రహీత చత్రపతి శివాజీ విగ్రహ నిర్వాహకులు, బండారి గంగాధర్ జన్మదిన వేడుకలు ఉంటాయని జన్మదిన వేడుక కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొంటారని బి జి ఆర్ యువసేన ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తారని



అన్నారు. జన్మదిన వేడుకలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## కేంద్ర ప్రభుత్వ కుల గణన చట్టాన్ని బహుజన్ సమాజ్ పార్టీ స్వాగతిస్తుంది

*** బహుజన్ సమాజ్ పార్టీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ రామచంద్ర**

మందమర్రి, మే 03 సమయం న్యూస్: కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు కులగణన చేయాలని చట్టం వేయడాన్ని బహుజన్ సమాజ్ పార్టీ సాగతిస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ రామచంద్ర తెలిపారు. శనివారం పట్టణ ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముందుగా పహెల్గా ఉగ్రదాడి మృతులకు ఆత్మ శాంతి చేకూరాలని, దాడికి కారణమైన ఉగ్రవాదులను అణచివేసేందుకు, పాకిస్తాన్ దేశానికి బుద్ధి చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్న



బహుజన్ సమాజ్ పార్టీ సాగతిస్తుందని, ప్రభుత్వం వెన్నంటే ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేయడానికి చట్టాన్ని రూపొందించిందని దీనికి బహుజన్ సమాజ్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతుందని, గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్ల కాలంలో ఏనాడు కుల గణన చేయలేదని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చేసిందని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం తప్పుల తడకతో బీసీలకు అన్యాయం చేసే విధంగా వారి జనాభా సంఖ్యను తగ్గించి చూపించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బీసీలకు ఎప్పుడైనా అన్యాయమే జరిగిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో మంచిర్యాల జిల్లాలోని ఎమ్మెల్యేలు కూడా అదే పతంలో నడుస్తున్నారని, అభివృద్ధి అనేది మచ్చుకైనా కానరావడం లేదని అన్నారు. బీసీల అభివృద్ధి మంచిర్యాల జిల్లా అభివృద్ధి కోసం పోరాటం చేసేందుకు బహుజన్ సమాజ్ పార్టీని మరింత పార్టీష్టపరుస్తామని, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ జోనల్ కోఆర్డినేటర్ కాదాసీ రవీందర్, జిల్లా అధ్యక్షులు ముల్కల రాజేంద్రప్రసాద్, మందమర్రి పట్టణ అధ్యక్షులు గాజుల శంకర్, నాయకులు దుర్గం రాజశేఖర్ కుమ్మరి కృష్ణ, నారాయణ, జోసఫ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## కార్మికులకు అండగా ఐఎన్టీయూసీ

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 03 సమయం న్యూస్: కార్మికులకు అండగా ఐఎన్టీయూసీ ఉంటుందని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ నాయకులు, గరిగే స్వామి, భీమ్ రావులు అన్నారు. శనివారం జిల్లాలోని శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే5 గని ఆవరణలో ఐఎన్టీయూసీ 78వ ఆవిర్భావ వేడుకలను జెండా ఆవిష్కరించి, ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రమ శక్తి అవార్డు గ్రహీత భీమ్ రావు, ఏరియా ఉపాధ్యక్షులు శంకర్ రావు లను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు మాట్లాడుతూ, కార్మికుల శ్రేయస్సుకై అనుక్షణం పనిచేసి, ఎన్నో హక్కులను సాధించడం జరిగిందని, ఐఎన్టీయూసీ యూనియన్ కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు పేరం రమేష్, జీవన్ జోయల్, మెండ వెంకటి, అశోక్, నీలం సాదయ్య, నర్సింగ్, లాగల శ్రీనివాస్, పెద్ది రాజు, మహేందర్ రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

*** జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 03 సమయం న్యూస్: జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 341 కేంద్రాలు ప్రారంభించి ఇప్పటి వరకు 160 కొనుగోలు కేంద్రాల ద్వారా 4 వేల 335 మంది రైతుల వద్ద నుండి 37 వేల 730 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో



15 కోట్ల 47 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నిత్యం 4 వేల నుండి 6 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 155 లారీల ద్వారా 1 వేయి 600 నుండి 3 వేల టన్నుల ధాన్యం కరీంనగర్ లోని 48 మిల్లులకు, జిల్లాలోని 16 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 3 కోట్ల రూపాయల నుండి 5 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్, గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

*** జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 03 సమయం న్యూస్: వేసవి సెలవులలో విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందిస్తూ పాఠ్య, పాఠ్యేతర అంశాలను అందిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బాలికల వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవిలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, స్పీడ్ మాథ్స్, డాన్స్, మ్యూజిక్, యోగ, మెడిటేషన్, కంప్యూటర్ కోడింగ్, పెయింటింగ్ మొదలైన అంశాలలో శిక్షణ అందించేందుకు శిబిరం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని, ఈ నెల 17వ తేదీ వరకు 15 రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఒక బృందం, వ్యవస్థను సమర్ధవంతంగా నడిపించే వ్యక్తి నాయకుడని, విద్యార్థులు చిన్నతనం నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అన్నారు. క్రీడలు, ఇతర రంగాలలో జట్టులో ఉన్న సభ్యులందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే విజయం సాధించవచ్చని అన్నారు. ప్రతి రోజు కొత్త విషయాలను నేర్చుకోవాలని, వేసవి శిక్షణ శిబిరాలలో విద్యార్థులకు కొత్త విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. మనం నేర్చుకునే అంశాలను నిశితంగా పరిశీలిస్తే విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని, ప్రజా ప్రయోజనకరంగా వినూత్న ఆవిష్కరణలు రూపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఒక సమస్యను అనేక దారులలో పరిష్కరించవచ్చని, చివరగా పూర్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యమని



అన్నారు. క్రీడలు, సంగీతం, చిత్రలేఖనం ఇతర రంగాలలో ప్రయత్నించడమే తొలి విజయమని, ఏకాగ్రత, ఇష్టంతో నేర్చుకుంటే నైపుణ్యత సాధించవచ్చు అని అన్నారు. ఏ అంశంలోనైనా నిరంతరం ప్రయత్నిస్తుంటే ఆ రంగంలో రాణించవచ్చని, ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధితో ప్రయత్నించాలని తెలిపారు. జిల్లాలోని 18 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల నుండి దాదాపు 200 మంది విద్యార్థినులను తీసుకురావడానికి ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణ మూర్తి, నస్పూర్ మండల విద్యాధికారి దామోదర్ రావు, శిబిరం సమన్వయకర్త, నస్పూర్ ప్రత్యేక అధికారి మౌనిక, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్లీ బర్డ్ పథకానికి సమయం పెంపు

జిన్నారం, మే 3,సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ లో ఆస్తి పన్ను చెల్లించేవారికి ఎర్లీ బర్డ్ స్కీంను ఈనెల 7వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని బొల్లారం మున్సిపల్ కమిషనర్ పి మధుసూదన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని బొల్లారం మున్సిపాలిటీ లోని టాక్స్ పెయిర్స్ సద్వినియోగం చేసుకోవాలని, ఇప్పటివరకు ఆస్తి పన్ను



చెల్లించని వారు ఐదు శాతం రీబెట్ తో ఈనెల 7 వ తేదీ లోపల చెల్లించాలని వారు కోరారు. సకాలంలో చెల్లించని వారికి నోటీసులు జారీ చేస్తామని వారు తెలిపారు.

## మండల పాత్రికేయులకు ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మాజీ జెడ్పిటిసి.!

*** పబ్బ మహేష్ గుప్తా.!!**

సమయం న్యూస్ , శివంపేట : శివంపేట మండలంలోని వివిధ పత్రిక విలేకరులకు ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా మాట్లాడుతూ సమాజంలోని ఆర్థిక, రాజకీయ సామాజిక తదితర అన్ని వర్గాల అంశాలను సమన్వయం చేస్తూ సమాజ శ్రేయస్సు కోరుకునే పత్రిక



విలేకరులకు అందరికీ పేరుపేరునా ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు అని అన్నారు.

## తెలంగాణా స్పోర్ట్స్ అథారిటీకి ఫుట్ బాల్ ప్రోత్సాహక అవార్డు

అంబర్ పేట,మే, 3(సమయం న్యూస్): అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) వార్షిక అవార్డుల దినోత్సవం 02.05.2025న భువనేశ్వర్ లో జరిగింది. 202425 సంవత్సరానికి గాను తెలంగాణలోని హైదరాబాద్లో ఫుట్ బాల్ ను ప్రోత్సహించడంలో, ప్రోత్సహించడంలో విశేష కృషి, సహకారం అందించినందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణను అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఏఐఎఫ్ఎఫ్ వార్షిక అవార్డుల దినోత్సవం సందర్భంగా సత్కరించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనిబాలా దేవి ఐఎఫ్ఎస్ ఈ అవార్డును




అందుకున్నారు. ఏఐఎఫ్ ఎఫ్ వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏఐఎఫ్ ఎఫ్ అధ్యక్షుడు శ్రీ కల్యాణ్ చౌబే, ఒడిశా గౌరవ ఉపముఖ్యమంత్రి శ్రీ కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ఒడియా భాషా సాహిత్యం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ సూర్యవంశీ సూరజ్, ఐఏఎస్, ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ భాస్కర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఐఏఎస్, ఒడిశా ప్రభుత్వ క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర సభ్యులు అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీమతి సోనీ బాలాదేవి, ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ తెలంగాణ ఫుట్ బాల్ కు దక్కిన గౌరవం, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి తెలంగాణ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఏఐఎఫ్ఎఫ్ కు తెలంగాణ ప్రభుత్వం తరపున వీసీ అండ్ ఎండీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కృతజ్ఞతలు తెలియజేశారు.

## డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కొరకు దరఖాస్తుల స్వీకరణ

*** జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 03 సమయం న్యూస్: విద్యా సంవత్సరంలో దుర్గాబాయి దేశ్ ముఖ్ మహిళ సాంకేతిక శిక్షణ సంస్థ హైదరాబాద్ లో డిప్లొమా కోర్సులలో ప్రవేశం కొరకు అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన, నిరుపేద కుటుంబాలకు చెందిన, అణిచివేతకు గురైన, ఇతర బాధిత బాలికలు, సిసిఐలో నివసిస్తున్న బాలికల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా



ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలలో ఒక్కొక్క విభాగంలో కేటాయించబడిన 60 సీట్లలో 70 శాతంతో 42 సీట్లు రిజర్వేషన్ కల్పించడం జరిగిందని, ఎస్ఎస్సి ఉత్తీర్ణులై ఆర్ఫన్, సెమీ ఆర్ఫన్, బిపిఎల్, డిస్టిట్యూట్, విక్టిమ్స్ ఆఫ్ ట్రాఫికింగ్ ఇన్మేట్స్ ఆఫ్ హోమ్స్, ఉమెన్ ఇన్స్టిట్యూషన్స్ వారికి రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపారు.

## అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డు జారీ

*** జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 03 సమయం న్యూస్: రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డు జారీ చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పెండింగ్ లో ఉన్న నూతన రేషన్ కార్డులు, కార్డులలో సభ్యులను చేర్చడంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తులను సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారిని ఎంపిక చేసి జిల్లాలో 956 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డులలో పిల్లలను చేర్పించుట, ఇతర మార్పులకు సంబంధించి 29 వేల 237 దరఖాస్తులు విచారించి ఆమోదించడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, మీసేవలో దరఖాస్తు చేసుకోవచ్చని, అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# పేదోడి ఇంటికి రూ. 5 లక్షలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

* **ఈ ఏడాది 22 వేల కోట్ల రూపాయిలతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం**
* **శిక్షణ పొందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికేట్ల అందజేత**
* **రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్ :,(సమయం న్యూస్) భారతదేశంలో పేదలకు ఇంత పెద్ద ఎత్తున రూ. 5 లక్షలతో సంవత్సరానికి నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ఏడాది 22 వేల కోట్ల రూపాయిలతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని ఇందుకు సంబంధించి మరికొద్దిరోజుల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తామని ఇప్పటికే పైలట్ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ లో అవుట్ సోర్సింగ్ లో నియామకమైన 350 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్) లో ఆరు రోజుల పాటు శిక్షణ పొందారు. శనివారం నాడు న్యాక్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శిక్షణ పొందిన ఇంజనీర్లకు సర్టిఫికేట్లను అందజేశారు. సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అవినీతికి ఆస్కారం లేకుండా నిజాయితీ నిబద్దతతో పనిచేసి పేదవాడి చిరకాల కోరిక నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగస్వాములు కావాలని అసిస్టెంట్ ఇంజనీర్లకు విజ్ఞప్తి చేశారు. ఎంపికైన 350 మంది ఇంజనీర్లలో 45 శాతం మహిళలే ఉండడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎన్ని వత్తిళ్లు వచ్చినా కూడా మెరిట్ పద్దతిలోనే ఎంపిక చేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఏ సంక్షేమ పథకం కింద ఒక్క లబ్దిదారునికి 5 లక్షల రూపాయిలు ఇస్తున్న పథకం లేదని అన్నారు. ఇండ్ల పథకాల్లో కూడా కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని కానీ తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ ప్రభుత్వం 5 లక్షల రూపాయిలతో 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఇండ్లను లబ్దిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం కొద్దిరోజుల్లోనే నాలుగు లక్షల మంది జాబితా ఫైనల్ చేయబోతున్నామని విధుల్లో చేరిన వెంటనే అసిస్టెంట్ ఇంజనీర్లు ఈ జాబితాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలు, వత్తిళ్లకు గురికాకుండా అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు లభించేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల చెల్లింపుల్లో ఎలాంటి మధ్యవర్తులు ప్రమేయానికి ఆస్కారం లేకుండా ఉండేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణం పూర్తి చేసుకున్నలబ్ధిదారులకు ప్రతిసోమవారం చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. నిర్మాణ రంగంలో తనకు ఉన్న అనుభవంతో తక్కువ ఖర్చు, నాణ్యతతో ఇండ్లను నిర్మించడానికి అధికారులకు పలు సూచనలు చేయడం జరిగిందని యువ ఇంజనీర్లు కూడా ఈ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించి లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

## కంగ్టి బీజేపీ మండల అధ్యక్షుడిగా సచిన్ స్వామి



కంగ్టి,3మే,(సమయం న్యూస్) : భారతీయ జనతా పార్టీ నూతన మండల అధ్యక్షుడిగా కంగ్టి మండల కేంద్రానికి చెందిన సచిన్ స్వామిను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కంగ్టి గ్రామానికి చెందిన సచిన్ స్వామి గత కొంత కాలంగా పార్టీలో కష్టపడి పని చేస్తున్న ఆయనను పార్టీ గుర్తించి మండల అధ్యక్షులుగా ప్రకటించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సచిన్ స్వామి మాట్లాడుతూ......... పార్టీ పెద్దలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ ఆదేశాల మేరకు తూచా తప్పకుండా నెరవేరుస్తానని అన్నారు. బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్షులకు పార్టీ నాయకులకు ధన్యవాదములు తెలిపారు. కంగ్టి మండలంలో బీజేపీ పార్టీ బలోపేతానికి శాయశక్తులు కృషి చేస్తానని అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాషాయం జండా ఎగరవేయడమే నా ధ్యేయం అన్నారు. పార్టీ నాయకులు,కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.



## సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

* **గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓలపు నారాయణ**

తొగుట .మే 3 (సమయం న్యూస్) : తొగుట మండలంలోని లక్ష్మాపూర్ (R&R) గ్రామానికి చెందిన పిట్ల గౌరవ్వ కి దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు 36000 రూపాయల సీఎం సహాయనిధి చెక్కుని అందజేశారు. కార్యక్రమంలో NSUI మండల అధ్యక్షులు ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్,సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ ఆర్.వి కర్ణన్



హైదరాబాద్, మే 03: గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు చేపట్టే శిల్ప లే ఔట్ రెండో దశ పనులను మే నెల చివరి వరకు పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు తో కలిసి కమిషనర్ మల్కం చెరువు, గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు చేపట్టే శిల్పాలే ఔట్ రెండో దశ పనులను కమిషనర్ పరిశీలించారు. మల్కం చెరువు వద్ద శానిటేషన్, కుక్కల బెడద పై వాకర్స్ ఫిర్యాదు చేయడంతో వెంటనే నిర్వాహకులతో మాట్లాడి వాకర్స్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్ట్రామ్ వాటర్ డ్రైన్ చెరువులోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖాజాగూడ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా హెచ్. సిటీ ద్వారా చేపట్టే ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణ స్థలాన్ని పరిశీలన చేసారు. గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు మూడు వరుసల బైడైరెక్షన్ శిల్పా లే ఔట్ ఫ్లై ఓవర్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ ఫ్లై ఓవర్ వలన చేరవలసిన గమ్య స్థానానికి ఎన్ని నిముషాల్లో వెళ్తారని కమీషనర్ అధికారులను వివరణ కోరగా ఓఆర్ఆర్ నుండి కొండాపూర్ కు, కొండాపూర్ నుండి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు హైటెక్ సిటీకి వెళ్లేందుకు సులభతరం అవుతుందని ప్రాజెక్టు ఇంజనీర్లు కమిషనర్ కు వివరించారు. ఫ్లైఓవర్ పూర్తవ్వడానికి ఎంత కాలం పడుతుందని ఇంజనీరింగ్ అధికారులను అడుగగా ఫ్లైఓవర్ పైన బిటి, ఎల్ ఈ డి లైట్ల పనులు కొనసాగుతున్నాయని, సర్వీస్ రోడ్డు పనులు సుమారు 5 ఆస్తుల భూసేకరణ పక్రియ పూర్తయితే 15 రోజుల్లో పూర్తవుతుందని ఇంజనీర్లు తెలపడంతో ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. భూసేకరణ పక్రియను త్వరగా పూర్తి చేయాలని అక్కడే ఉన్న జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. కమిషనర్ వెంట జోనల్ ఎస్.ఈ శంకర్ నాయక్, డిసి ప్రశాంతి, ప్రాజెక్టు ఈఈ నమ్యా నాయక్, డిప్యూటీ ఈ ఈ హరీష్, యు బి డీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## ఎయిడ్స్ బాధిత చిన్నారులకు డిజైర్ సొసైటీ సేవలు అభినందనీయం

* **యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్**

జిన్నారం, మే 3 సమయం న్యూస్ : ఎయిడ్స్ బాధిత చిన్నారులకు డిజైర్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోగల డిజైర్ సొసైటీలో శనివారం వేసవి శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూఎస్ కాన్సుల్ జనరల్ జన్నీఫర్ లార్సన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్, నటుడు జెమినీ సురేష్కూడా ఈ కార్యక్రమానికి హాజరై చిన్నారులతో గడిపారు. చిన్నారులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సమ్మర్ క్యాంప్ లో భాగంగా చిన్నారులకు ఆయా విభాగాల్లో ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు జెన్నీఫర్ తోపాటు ఆర్పీ పట్నాయక్ లు బహుమతులను అందించారు. అనంతరం జెన్నీఫర్ లార్సన్ మాట్లాడుతూ ఎయిడ్స్ బాధిత చిన్నారులకు డిజైర్ సొసైటీ 19 ఏళ్లుగా అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. సొసైటీకి తాము కూడా అండగా ఉంటామని తెలిపారు. చిన్నారులు అధైర్య పడకుండా వారు నిర్దేశించుకున్న లక్ష్యాలను ఛేదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్, సొసైటీ ఫౌండర్ రవిబాబు, జిల్లా బాలల సంరక్షణ అధికారి రత్నం, నటుడు జెమిని సురేష్, సంస్థ ప్రతినిధులు సుభాష్, రాజ్ కుమార్, సునీల్ కుమార్ లతోపాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెల్ నెస్ సెంటర్ ను సందర్శించిన కలెక్టర్

* **తగిన సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశం**



నిజామాబాద్, మే 03 :(సమయం న్యూస్) జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ పాత భవనంలో కొనసాగుతున్న వెల్ నెస్ సెంటర్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం సందర్శించారు. నుడా చైర్మన్ కేశ వేణు, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ లతో కలిసి వెల్ నెస్ సెంటర్ లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఆరోగ్య పరీక్షలు, చికిత్స కోసం వచ్చే రిటైర్డ్ ఉద్యోగులకు తగు సదుపాయాలు అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వెయిటింగ్ హాల్ తో పాటు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్స్, ఔషధాలను పంపిణీ చేసే గదులను అందుబాటులోకి తేవాలని, వెల్ నెస్ సెంటర్ కు ఆనుకుని ఉన్న గదులకు మరమ్మతులు చేయడంతో పాటు కొత్తగా వెయిటింగ్ హాల్ నిర్మించాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని, పనులను సత్వరమే చేపట్టి పూర్తి చేయాలని అన్నారు. వెల్ నెస్ సెంటర్ ద్వారా రిటైర్డ్ ఉద్యోగులకు, పాత్రికేయులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనాన్ని కలెక్టర్ సందర్శించారు. సమావేశ మందిరం, పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని సంఘ ప్రతినిధులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఇంచార్జి ఆర్డీఓ స్రవంతి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రవీందర్ రావు, భూమాగౌడ్, రామ్ మోహన్ రావు తదితరులు ఉన్నారు.

# వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలి

* **జిల్లా పాలనాధికారి రాజర్షి షా**

హైదరాబాద్ మే03( సమయం న్యూస్) : వేసవి లో భానుడి ప్రతాపం రోజు రోజుకి తీవ్రరూపం దాల్చి ప్రజలను అనారోగ్యానికి గురయ్యేలా చేస్తున్న నేపథ్యంలో వేసవికాలం ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్య వడదెబ్బ. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా బయట పనికి వెళ్లే వాళ్లే కాదు.. ఇంట్లో ఉండే వృద్ధులు, పిల్లలు కూడా వడదెబ్బకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయని ఈ సందర్భంగా కొన్ని జాగ్రత్తలు పాటించి వడదెబ్బ తగలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే.. ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉంటుందని, వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండాలంటే, శరీరానికి తగినంత నీరు అందించడం, ఎండ తగలకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవడం,తేలికైన దుస్తులు ధరించడం, మధ్యాహ్న వేళలో బయటకు వెళ్లకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లవలసివస్తే గొడుగు , వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవడం ముఖ్యం.

* **వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు:**

శరీరాన్ని హైడ్రేట్గా ఉంచుకోండి:

వేసవిలో శరీరానికి తగినంత నీరు అందించడం చాలా అవసరం. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి, ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు వంటివి. ఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ తగలవచ్చు. కాబట్టి, నీడలో ఉండటం, టోపీ, గొడుగు వంటివి ఉపయోగించడం, సూర్యరశ్మిని నిరోధించే దుస్తులు ధరించడం మంచిది.



**తేలికైన దుస్తులు ధరించండి:**

వేసవిలో తేలికపాటి వస్త్రాలను ధరించడం మంచిది. రంగుల దుస్తులను ధరించడం వల్ల సూర్యరశ్మి శరీరంపైకి ఎక్కువగా పడుతుంది. మధ్యాహ్న వేళలో ఎండ చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ఆ సమయంలో బయటకు వెళ్లడం మంచిది కాదు. వీలైతే ఉదయం, సాయంత్రం గాలి చల్లగా ఉన్నప్పుడు బయటకు వెళ్లడం మంచిది.

* **వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోండి:**

వడదెబ్బ లక్షణాలు (తలనొప్పి, వాంతులు, మైకము, అధిక జ్వరం, తల తిరగడం, స్పృహ కోల్పోవడం) కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

**పిల్లలు వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధ:**

పిల్లలు వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకూడదు. వీలైనంతవరకు ఇంట్లోనే ఉంచడం మంచిది.

**మందులు సక్రమంగా తీసుకోండి:**

ఏదైనా మందులు తీసుకుంటున్నట్లయితే, డాక్టర్ సూచనల ప్రకారం మందులు తీసుకోవడం చాలా ముఖ్యం అని పేర్కొన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

గుమ్మడిదల,మే 3,సమయం న్యూస్ : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గుమ్మడిదల మండలం బొంతపల్లి లో శనివారం జరిగింది. మృతుని సోదరుడు మిర్యాల శివ కథనం ప్రకారం నేను, మా తమ్ముడు మిర్యాల ప్రసాద్(20) కామారెడ్డి జిల్లా బిక్నూర్ గ్రామానికి చెందిన వారమని, గత 2 సంవత్సరాల నుండి బొంతపల్లి గ్రామంలో చెత్త డబ్బాలు ఏరుకొని,వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నామని తెలిపాడు. ఈనెల 1వ తేదీన ఉదయం కటింగ్ చేసుకుంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన తమ్ముడు రాత్రి వరకు కూడా ఇంటికి రాకపోతే ఎక్కడో అట్ట డబ్బాలు సేకరించడానికి వెళ్ళాడు అనుకున్నాను. కానీ శనివారం ఉదయం 8 గంటల సమయంలో గ్రామస్తులు ద్వారా బొంతపల్లి గ్రామంలో గల అల్కా చెరువులో ఒక వ్యక్తి పడి ఉన్నాడని తెలిసింది. నేను అక్కడికి వెళ్లి చూడగా అల్కా చెరువులో తెలియాడుతున్న మృతదేహం మా తమ్ముడు మిర్యాల ప్రసాద్ గా గుర్తించడం జరిగింది.మా తమ్ముడు మృతికి ఎలాంటి అనుమానాలు లేవని, ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన అని తెలిపారు.



## మండల వ్యవసాయ అధికారి రివ్యూ మీటింగ్

కంగ్టి, 3 మే (సమయం న్యూస్) : కంగ్టి మండలం లోని ఎరువుల దుకాణం దారులతో MAO హరీష్ శనివారం నాడు సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో రానున్న వానాకాలం సీజన్ లలో రైతులకు విత్తనాలు, ఎరువులు,అందుబాటులో ఉంచుకోవాలని,వారికీ సూచించారు. మార్కెట్ లోనాసిరకమైన (నకలి ) విత్తనాలు అమ్మితే వారి షాప్ తో పాటు లైసెన్స్ ను క్యాన్సల్ చేసి, కట కటలకు పంపిస్తామని హెచ్చరించారు. అలాగే దుకాణలలో స్టాక్ రిజిస్టర్ ను, ఈ పాస్ మిషన్ లో వ్యత్యాసం లేకుండా నమోదు చేసుకోవాలని,అలాగే,స్టాక్ బోర్డు పై రోజుల వారిగా వ్రాసి ఉంచాలని,ప్రో ప్రేటర్ లైసెన్స్ ను అందరికి కనిపించే విధంగా ఉండాలని,బ్యానర్ పై చరవాణి నెంబర్ల, జిల్లా, డివిజన్, మండలం వ్యసాయ అధికారులు నంబర్ ను అతికించాలని సూచించారు. వారిని డీలర్స్ లందరు శాలువాతో సన్మానం చేసారు. కార్యక్రమంలో పర్టీ లైజర్ మండల అధ్యక్షులు రమేష్ సెట్,నర్సారెడ్డి, ఉమాకాంత్,దారం వెంకటేష్,సురేష్ పటేల్,దత్త పటేల్,శివాజీ పటేల్,దత్త పటేల్,రాజు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై బోధన్ సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయి సమీక్ష

ఎడపల్లి మండలం, మే 4, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో శనివారం రోజున బోధన్ డివిజన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఎంపీడీఓ ఎడపల్లి, అంబం పంచాయతీ కార్యదర్శితో కలిసి ఇందిరమ్మ ఇండ్ల కొనసాగింపు సర్వే స్థలాలను ప్రత్యక్షంగా సందర్శించారు. ఈ సందర్భనలో సబ్ కలెక్టర్ సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. క్షేత్రస్థాయి సిబ్బందితో సంభాషిస్తూ, వారు సేకరించిన డేటాను పరిశీలించి పనుల నాణ్యతపై దృష్టి సారించారు. డేటా సేకరణలో ఖచ్చితత్వం, పూర్తి సమాచారం ఉండాలన్న దానిపై సబ్ కలెక్టర్ స్పష్టమైన దృష్టి పెట్టారు. ప్రతి ఇంటి వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని, ఎలాంటి లోపాలు లేకుండా డేటా సేకరించాలన్న దానిపై ఆయన స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఇక మిగిలిన సర్వే పనులను వేగంగా పూర్తిచేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా మొత్తం సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీఓ, ఎడపల్లి, పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల అమలు పురోగతిలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.



## మంత్రాల చెరువు సందర్శించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మీర్పేట మే 03 (సమయం న్యూస్) : మహేశ్వరం నియోజక వర్గం లోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువును ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సందర్శిం చారు. చెరువు చుట్టూ రెండున్నర కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి, అక్కడి సమస్యలను పరిశీలించారు. ఫెన్సింగ్ ధ్వంసమై ఉండటం, వీధిదీపాలు పనిచేయకపోవడం, చెరువులో గుర్రపుడెక్క ఉండటం వంటి సమస్యలను గుర్తించారు. చెరువు కొంత భాగం ఎండిపోయినందున పూడికతీత పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పై సమస్యలన్నింటినీ 15 రోజుల్లోపూ పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ మరియు సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జ్ఞానేశ్వర్ , మరియు డి ఈ , పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు

* ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికను త్వరగా పూర్తిచేయాలి
* జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగాం మే03 (సమయం న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు గాను ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. శనివారం, జిల్లాలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఇందిరమ్మ ఇళ్లపై అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, పరిశీలన అధికారులతో గూగుల్ మీట్ ద్వారా ఆయా పురపాలికలు, మండలాల వారీగా




ఎంత మేరకు పూర్తి చేశారో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన ప్రక్రియలో భాగంగా జనగామ నియోజకవర్గంలో (13) మంది, ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలో (17) మంది, పాలకుర్తి నియోజకవర్గంలో (10) మంది పరిశీలన అధికారులు సర్వే చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు లక్ష్యాల వారీగా నిర్దేశించుకొని అర్హుల ఎంపికను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో ఎక్కడా కూడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సజావుగా సర్వే చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా..అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే సర్వే చేసిన వివరాల పత్రాలను అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. పరిశీలన చేసే క్రమంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం తగదని, సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. గ్రామాల వారీగా పరిశీలన పూర్తి కాగానే అర్హుల జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించాలని వెల్లడించారు. ఈ సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, గృహ నిర్మాణ పీడీ మాతృ నాయక్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎండ తీవ్రత కు గురికాకుండా జాగ్రతలు పాటిద్దాం

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్**

మహబూబాబాద్ మే 03 (సమయం న్యూస్) : రాష్ట్రంలో మరియు జిల్లాలో ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్నందున వేసవి కాలంలో తీవ్రమైన ఎండ, వేడి గాలులు వీచినప్పుడు "వడదెబ్బకు" గురయ్యే అవకాశం కలదని ప్రజలందరూ తగిన జాగ్రతలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్. రవి రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

**లక్షణాలు:** వేసవికాలంలో వడ దెబ్బకు గురైనప్పుడు ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండి పోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం (తగ్గడం), మూత్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట రావడం, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్ళే అన్ని లక్షణాలు గాని లేక కొన్ని లక్షణాలు గాని కనిపిస్తాయని పేర్కొన్నారు.

**ప్రథమ చికిత్స:** వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ గల ప్రదేశానికి చేర్చాలి, శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి, ఎండ దెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజు, పప్పుకట్టు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని త్రాగించాలి, సత్వర చర్యల కొరకు 108 అత్యవసర సేవలను సంప్రదించాలి. ప్రథమ చికిత్స చేసిన తరువాత దగ్గరలో గల ఆరోగ్య కేంద్రం/ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని తెలిపారు. జాగ్రత్తలు: వడ దెబ్బ తగలకుండా ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం/ఆడటం చేయరాదు, తప్పనిసరి పరిస్థితులలో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు తప్పక ధరించాలి, తెల్లని నూలు వస్త్రాలు ధరించాలి, నీరు మరియు ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి, మత్తు పానీయాలు తీసుకోరాదు, ముఖ్యంగా ఇంటివద్ద వుండే పిల్లలు, 60 సం.ల. పై బడిన వారు, అనారోగ్యంతో



బాధపడేవారు తరచుగా మంచినీరును మరియు ఓఆర్ఎస్ ను త్రాగలని, ఒకవేళ నోరు ఎండుకపోవడం, దాహం వేయడం లక్షణాలు వుంటే దగ్గరలోని ఆశా కార్య కర్తను సంప్రదించాలని తెలిపారు. అలాగే బయట పనికి వెళ్ళేవారు ఉదయం 12 గంటలలోపు మరియు సాయంత్రం 4 గంటల తదుపరి పనిచేసుకొవాలని మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవాలన్నారు.

**గమనిక:** ప్రతి ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రం, ఆశా కార్యకర్త వద్ద, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, గ్రామ పంచాయత్ లలో ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో కలవు కావున అవసరం ఉన్నవారు ఉపయోగించుకోగలరని పైన తెలిపిన జాగ్రత్తలు పాటిస్తూ వడ దెబ్బకు గురి కాకుండా చూసుకోవాలని తెలిపారు. అంతే కాకుండా వేసవి కాలంలో వచ్చే వ్యాధుల పై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

# పోలీసుల నిఘా నీడలో నీట్ ప్రవేశ పరీక్ష

హన్మకొండ మే03 (సమయం న్యూస్) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం జరగనున్న నీట్ (యూ.జి) పరీక్ష సజావుగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేస్తూ మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షకు అభ్యర్థులను కేంద్రంలోనికి ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 01:30 గంటల వరకు మాత్రమే అనుమతించాలని. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని.పరీక్ష కేంద్రాల వద్ద 163 బి.యన్.యస్.యస్, /(144) సెక్షన్ అమలులో ఉంటుందని, సెంటర్ల వద్ద గుంపులు, గుంపులుగా తిరగడానికి వీలులేదని, 100 మీటర్స్ వపల ఉన్న




అన్నీ జిరాక్స్ షాప్ మూసివేయాలన్నారు. అభ్యర్థులు, ఇన్విజిలేటర్స్ ఎవ్వరూ ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకొని వెళ్లరాదన్నారు. అన్నీ పరీక్ష కేంద్రాలు సిసి కెమెరాల పర్యాయవేక్షణలో ఉంటాయన్నారు. సంబంధిత పోలీస్ అధికారులు ప్రతి ఒక్క అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోనికి అనుమతించాలని, పరీక్షా సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ.. పటిష్ట బందోబస్తు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. అలాగే పరీక్ష కు హాజరయ్యే అభ్యర్థులకు సీపీ సూచనలు చేస్తూ అభ్యర్థులు అడ్మిట్ కార్డు తో పాటు గుర్తింపు కార్డు, 2 పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, 1 పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటోలను తప్పనిసరిగా తీసుకొని రావాలని అన్నారు.

* అభ్యర్థులు, ఇన్విజిలేటర్లల యొక్క ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోనికి అనుమతించేది లేదని, అలాగే
* షూస్, సాక్స్, బెల్ట్, బంగారు,వెండి, ఇతర ఆభరణాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడవని, ఇవి లేకుండా అభ్యర్థులు పరీక్షకు రావాలని.
* ఫుల్ షర్ట్స్ కి అనుమతి లేదని, హాఫ్ హ్యాండ్ షర్ట్స్ మాత్రమే వేసుకోవాలి. ట్రాన్స్పరెంట్ / పారదర్శకంగా ఉండే వాటర్ బాటిల్స్ కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.
* అడ్మిట్ కార్డ్ నందున్న సూచనలు పాటిస్తూ.. పరీక్ష కేంద్రాలకు సకాలంలో హాజరు కావాలని పోలీస్ కమిషనర్ అభ్యర్థులు సూచనలు చేశారు.
* ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్ తో పాటు ఐటీ కోర్, కమ్యూనికేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ఎల్ ఆర్ ఎస్ సద్వినియోగం చేసుకోండి :నగర మేయర్ సుధారాణి

యం న్యూస్) : ఎర్లీ బర్డ్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల ఏడవ తేదీ వరకు గడువు పొడిగించినందున ప్రాపర్టీదారులు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి తెలిపారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడేతో కలసి ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పురోగతి, 5% రిబెట్ (ఎర్లీ బర్డ్ ఆఫర్) వసూళ్ల, హీట్ వేవ్ పై సమీక్షించి సమర్ధ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎర్లీ బర్డ్ ద్వారా ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రిబేట్ పొందవచ్చు అని, ఇప్పటివరకు బల్దియా వ్యాప్తంగా 25 కోట్ల రూపాయలు ఆస్తి పన్ను వసూలు అయిందన్నారు. ఇంక మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున నగర ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రిబేట్ పొందాలని కోరారు. ఎల్ఆర్ఎస్ పై సమీక్షిస్తూ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రుసుము చెల్లించు గడువు నేటితో ముగుస్తుందని, ఇప్పటివరకు 30,500 మంది ప్లాట్ల క్రమబద్ధీకరణకు 170 కోట్ల రూపాయల ఫీజు చెల్లించారని తెలిపారు. అధికారులు ఫీజులు చెల్లించిన వారికి త్వరితంగా క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్లు జారీ చేయాలన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శుక్రవారం హైదరాబాద్లో హీట్ వేవ్ పై తీసుకోవాల్సిన చర్యలపై ఏక్షన్ ప్లాన్ విడుదల చేసి ఆదేశించిన విధంగా చర్యలు తీసుకోవాలని మేయర్ అన్నారు. వేసవిలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలు



రక్షించుకునేందుకు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని మేయర్ అధికారులను కోరారు. అధిక ఉష్ణోగ్రతలు వడగాల్పుల దృష్ట్యా ఇప్పటికే నగరవ్యాప్తంగా చలివేంద్రాలు, ముఖ్య కూడళ్ల వద్ద గ్రీన్ షెడ్లు బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి తోడుగా కుక్కలకు, పక్షులకు నీతి తొట్టెలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధిక ఉష్ణోగ్రత వల్ల ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అందుకుగాను కమర్షియల్ కాంప్లెక్స్ సెల్లార్లలో నిర్మాణాలు లేకుండా చూడాలని, షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ఎలా నగర ప్రజల్లో అవగాహన కల్పించాలని టపాకాయలు తయారు కేంద్రాల వద్ద, ఎక్కువ గన్నీ బ్యాగులు ఉన్నచోట్ల, ప్లాస్టిక్ సామాగ్రి అధికంగా ఉన్న ప్రాంతాల్లో నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించి రెడ్ మార్క్ స్టిక్కర్ వేసి వర్షాకాలానికి ముందే ఆయా శిథిల గృహాలను తొలగించేలా ప్రణాళిక బద్ధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని డిఎఫ్ఓ ను ఆదేశించారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక



# జూబ్లిహిల్స్ లో కబ్జాకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం

హైదరాబాద్ మే03( సమయం న్యూస్) : బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయం ముందు కబ్జా కు గురై తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ , కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ,ఆర్డీవో ,ఎమ్మార్వో తదితర అధికారులు సర్వే నెంబర్ 102/1HAK/1 లో 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్నీ పరిశీలించి పెన్సింగ్ పై అధికారులకు పలు సూచనలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ 12 ఎకరాల ప్రభుత్వ స్థలంలో కబ్జా కు గురైన ప్రాంతంలో కూల్చివేసిన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు..

**మంత్రి పొన్నం ప్రభాకర్**



బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయం ముందు 102/1 సర్వే నెంబర్ లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలం కబ్జా కి గురికావడంతో కలెక్టర్ , ఆర్డీవో ఎమ్మార్వో తదితర అధికారులు రికార్డుల ఆధారంగా రెవెన్యూ అధీనంలోకి తీసుకోవడం జరిగింది. దీనిని ప్రజలకు ఉపయోగపడే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నిర్ణయం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో కి హైదరాబాద్ ఇన్చార్జి మంత్రిగా అభినందనలు తెలిపారు. ధరణి తరువాత భూ భారతి వచ్చిన సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు కబ్జా కు గురైనట్లయితే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ టాప్: మంత్రి ఉత్తమ్

హనుమకొండ: ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల వైఖరికి ధాన్యం దిగుబడే నిదర్శమని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీని చరిత్రాత్మక అంశంగా పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీకి మించిన సంక్షేమ పథకం మరొకటి లేదన్నారు. అర్హులైన పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖను ప్రక్షాళన చేస్తున్నట్లు తెలిపారు. ఈ శాఖలోని అన్ని సమస్యలను రెండేళ్లలో అధిగమిస్తామన్నారు. సీతమ్మసాగర్‌కు 68 టీఎంసీల గోదావరి జలాలు కేటాయించామన్నారు. కేంద్రంతో అనేక సార్లు చర్చించి నీటి వాటాను దక్కించుకున్నట్లు ఉత్తమ్ తెలిపారు.

# వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **వడగాల్పులకు ప్రజలు ఇబ్బందులు పడకుండా అవగాహన కల్పించాలి**
- **వేసవిలో జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.....**

సూర్యాపేట మే03 (సమయం న్యూస్) : జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున ,ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటన తెలిపారు. వేసవిలో ప్రజలు ఎండ తీవ్రత తో వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తల పై కలెక్టర్ వివరించారు. ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండల్లో బయట



తిరగకుండా జాగ్రత్త వహించాలని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప బయటికి రాకూడదని, మద్యాహ్నం 12 గంటల నుండి చారి సాయంత్రం 4 గంటల మద్యలో ఎట్టి పరిస్థితులలో ఇండ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు ఆయన సూచించారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో వడ దెబ్బలు, ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులలో వేసవి తీవ్రత ను దృష్టిలో ఉంచుకొని తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎక్కువగా ప్రచారం చేయాలని ఆదేశించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలలో పనిచేయవద్దని ఆల్కహాల్,టీ, కాఫీ, స్వీట్స్ చల్లని డ్రింక్స్ తీసుకోవద్దని, చెప్పులు లేకుండా బయట నడవవద్దని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతి రోజు సరిపడ నీరు త్రాగాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్ళేటప్పుడు గొడుగు లేదా టోపిని దరించాలని, ద్విచక్రవాహనాల పై సుదూర ప్రయాణాలు చేయకూడదని సూర్యుని కిరణాలు శరీరంపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటితో పాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి శరీరాన్ని కాపాడు కోవచ్చన్నారు. చర్మం పై ఎర్రటి దద్దుర్లు, చర్మం పొడిబారడం లాంటివి చర్మం పై వస్తున్న మార్పులను గమనించాలని, అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రులలో సంప్రదించి లేదా 108 కు ఫోన్ చేసి చికిత్స, అవసరమైన మందులు తీసుకోవాలని అన్నారు. వేసవి కాలంలో పలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## హైదరాబాద్‌విజయవాడ మధ్య ఆరులైన్ల రహదారికి ప్రయత్నాలు!

**: కిషన్‌రెడ్డి**

హైదరాబాద్: మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల నిర్మాణం వేగవంతమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ 33 జిల్లాల్లో 32 జిల్లాల నుంచి జాతీయ రహదారులు వెళ్తున్నట్లు చెప్పారు. ‘‘రోడ్లు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయి. రహదారుల అనుసంధానం అన్నిటికంటే ముఖ్యమైనది. అందుకే వాజ్‌పేయీ హయాంలో ఎన్డీయే ప్రభుత్వం ‘స్వర్ణ చతుర్భుజి’ పథకాన్ని తీసుకొచ్చింది. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని నిలిపివేసింది. రోడ్ల నిర్మాణంపై రూ.లక్షల కోట్లు ఎందుకని ఆనాడు విమర్శించారు. 2014లో తెలంగాణలో 2,500 కి.మీ మేర



జాతీయ రహదారులు ఉండేవి. పదేళ్ల తర్వాత అవి 5,200 కిలోమీటర్లకు చేరుకున్నాయి.తెలంగాణలో రింగ్ రోడ్ల అభివృద్ధి జరుగుతోంది. అనుసంధానం కోసం మోదీ ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చు పెడుతోంది. పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నాం. హైదరాబాద్‌శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. హైదరాబాద్‌విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారికి యత్నిస్తున్నాం’’ అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# నీట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాల్ పల్లి( సమయం న్యూస్) : నీట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాలను ఎస్పి కిరణ్ ఖరేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో నీట్ పరీక్షల నిర్వహించనున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాలలో 240 మంది, జూనియర్ కళాశాలల్లో 105 మంది మొత్తం 345 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులను రెండంచల నిశిత తనిఖీ తదుపరి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. విద్యుత్ అతరాయం లేకుండా నిరాటంకంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వేడి దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలతో పాటు ఓ ఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని అన్నారు. అత్యవసర సేవలకు గాను అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. అభ్యర్థులకు చల్లటి మంచినీరు అందించాలన్నారు. పరీక్షా



కేంద్రాల్లో వ్యర్ధాలు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.


- అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి సూచించారు.
- 4వ తేది మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను
- అనుమతిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 1.30 నిమిషాల తర్వాత గేట్ మూసి వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. నీట్ యు.జి. ప్రవేశ పరీక్ష నిర్వహణలో భాగంగా అభ్యర్థులు, సిబ్బంది

పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్, ట్యాబ్లెట్, బ్లూటూత్, స్మార్ట్ వాచ్, ఇయర్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతి లేదని, షూస్, బెల్ట్, ఆభరణాలు ధరించవద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా పకడ్బందీగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీవీ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి పరీక్షను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని అన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డ్ ప్రింట్ తీసుకొని పరీక్ష కేంద్రాలకు రావాలని, అడ్మిట్ కార్డు లేకుండా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని, పరీక్ష హాల్ ఇన్విజిలేటర్ ఒక కాపీ అడ్మిట్ కార్డ్ కలెక్ట్ చేసుకుంటారని, అభ్యర్థులు రెండు కాపీలు తీసుకుని రావాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు ముందుగానే నీట్ ప్రవేశ పరీక్ష అడ్మిట్ కార్డ్ లను డౌన్ లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, పోస్ట్ కార్డు సైజు ఫోటో, ఫోటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ ఫోటో) తప్పనిసరిగా వెంట తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్ మూసివేస్తామని, గేటు మూసిన తర్వాత ఎవ్వరిని లోపలికి అనుమతించరని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

## సర్టిఫికెట్ కోర్సుల శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తుల ఆహ్వానం

తెలంగాణ: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు, కంప్యూటర్, క్రాఫ్ట్, ఇతర టెక్నికల్ వృత్తులకు సంబంధించి 202526 విద్యా సంవత్సరంలో సర్టిఫికెట్ కోర్సులను అందించేందుకు అనుబంధ గుర్తింపు పొందాలని రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి (ఎస్ బీ టెట్) కార్యదర్శి ఎ.పుల్లయ్య తెలిపారు. ఈ నెల 12 వరకు ఆన్ లైన్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే దర ఖాస్తు చేసుకునేందుకు రూ.2000 లేట్ ఫీజుతో 15వరకు అవకాశం ఉందన్నారు. ధరఖాస్తులను www. affln. sbtet.telangana.gov. in/ccic ద్వారా సమర్పించాలని, వివరాలకు 8008908304 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# లాఫింగ్ గ్యాస్‌తో కుంగుబాటు దూరం!



నైట్రస్ ఆక్సైడ్... దీన్నే లాఫింగ్ గ్యాస్ అని కూడా అంటారు. నూటయాభైఏళ్లుగా ఈ లాఫింగ్ గ్యాస్‌ని దంత వైద్యంలో నొప్పి నివారిణిగా వాడుతున్నారు. ఇప్పుడదే లాఫింగ్ గ్యాస్ తీవ్రమైన కుంగుబాటు నుంచి బయటపడటానికి మార్గం చూపిస్తోందని చెబుతున్నారు పెన్సిల్వేనియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. కుంగుబాటుకి గురైన ప్రతి ముగ్గురిలో ఒకరికి థెరపీలూ, మందులూ కూడా పనిచేయడం లేదట. ఒకవేళ పనిచేసినా ఎక్కువ సమయం తీసుకుంటున్నాయి. కొన్ని కేసుల్లో అత్యవసరంగా వైద్యం అందించి కుంగుబాటు నుంచి బయటపడేయడానికి ఇతర మార్గాల కోసం అన్వేషిస్తున్న శాస్త్రవేత్తలకు లాఫింగ్ గ్యాస్ రూపంలో పరిష్కారం దొరికింది. డిప్రెషన్‌లో ఉన్న రోగులకి ఈ గ్యాస్‌ని అందించినప్పుడు అది మెదడులో అచేతనంగా ఉన్న ఎల్-5 న్యూరాన్లని చైతన్యవంతం చేయడం... కొన్ని ఏళ్లపాటూ డిప్రెషన్‌లో కూరుకుపోయిన వాళ్లు కూడా వేగంగా కోలుకోవడం చూశారు. కొంతమందిలో ఈ గ్యాస్ రెండువారాలపాటు సానుకూల ఫలితాలను అందించిందట. సో, ఈ గ్యాస్‌తో నోటి మాత్రలు రూపొందించి కుంగుబాటుకి చెక్ పెట్టొచ్చంటున్నారు శాస్త్రవేత్తలు.

# వీడ్కోలు విషయంలో ధోనీ ఆలోచన అదే : సునీల్ గావస్కర్



ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఆటతీరు ఈసారి అభిమానులను ఆకట్టుకోలేదు. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి ఎలిమినేట్ అయిన సీఎస్కే ఇవాళ చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడేందుకు సిద్ధమవుతోంది. కెప్టెన్ ఎంఎస్ ధోనీ నాయకత్వం చేపట్టినా ఆ జట్టు ఫలితాల్లో పెద్దగా మార్పు రాలేదు. ధోనీకిదే చివరి సీజన్ అనే వ్యాఖ్యలు వినిపిస్తున్న వేళ.. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ మాత్రం విభిన్నంగా స్పందించాడు. ధోనీ తీసుకొనే నిర్ణయం ఎప్పుడూ సరిగ్గానే ఉంటుందని వ్యాఖ్యానించాడు. అదే సమయంలో సీఎస్కే మేనేజ్‌మెంట్‌కు గావస్కర్ ఓ సూచన చేశాడు. "ఏ ప్లేయర్ అయినా సరే తన కంటే తాను ప్రాతినిధ్యం వహించే జట్టు ప్రయోజనం కోసం నిర్ణయాలు తీసుకుంటాడు. ధోనీ ఈ సీజన్‌లో ఆడాలని నిర్ణయించుకోవడం కూడా అందులో భాగమే. సీఎస్కేకు ఏది మంచిదైతే తను అదే చేస్తాడు. భవిష్యత్తులోనూ ఏదైనా డెసిషన్ తీసుకుంటే సీఎస్కే మంచిదా? కాదా? అనే ఆలోచిస్తాడు. అంతేగానీ, తనకు మంచిదా? కాదా? అనేది ఆలోచించడు" అని వ్యాఖ్యానించాడు.

*** బౌలింగ్‌పై దృష్టిపెట్టాల్సింది..**

"ఈ సీజన్‌లో సీఎస్కే ఆటతీరులో పెద్దగా దూకుడుగా లేదు. ఆ జట్టు బౌలింగ్ ఇబ్బందికరంగా ఉంది. వచ్చే సీజన్‌లో బలంగా దూసుకురావాలంటే బౌలింగ్‌పై దృష్టిపెట్టాలి. ఆక్షన్ స్ట్రాటజీలో ఈసారి కాస్త వెనుకబడినట్లు అనిపిస్తోంది. టాలెంట్‌ను గుర్తించే క్రమంలో ఇతర జట్ల కంటే సీఎస్కే మెరుగు కావాల్సి ఉంది. కేవలం బ్యాటర్లపైనే ఆశలు పెట్టుకోకూడదు. బౌలింగ్ చాలా కీలకం. నిలకడగా వికెట్లు తీసే బౌలర్లను ఎంపిక చేసుకోవాలి. వచ్చే సీజన్‌కు ముందు మినీ వేలం ఉంటుందంటున్నారు. అప్పుడైనా బౌలింగ్ యూనిట్‌ను బలోపేతం చేసుకోవాలి" అని సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు.



## పహల్గాం ఎఫెక్ట్.. ఆసియా కప్ కష్టమేనా?

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దేశమంతా ఆందోళన వ్యక్తమైంది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పాకిస్థాన్ కీలక పాత్ర పోషించిందనే విమర్శలు వచ్చాయి. క్రీడా సంబంధాలపైనా ఆ ఎఫెక్ట్ పడనుందని.. క్రికెట్ సహా ఇతర క్రీడల్లో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదని ఇప్పటికే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. క్రికెట్‌లోనూ ఇరు జట్ల మధ్య సిరీస్‌లు జరగడం లేదు. ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. ఈ విషయంలో ఐసీసీ కూడా దృష్టిపెట్టాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వ్యాఖ్యానించారు. దీంతో ఆసియా కప్‌లోనూ భారత్ పాల్గొనడంపై ఇప్పుడు అనుమానాలు వెల్లువెత్తాయి. టోర్నీని వాయిదా వేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. "ఆసియా కప్ సాధారణంగా తటస్థ వేదికపైనే నిర్వహిస్తున్నారు. ఈసారి ఇంకా షెడ్యూల్‌ను ప్రకటించలేదు. బంగ్లాదేశ్ సిరీస్ అనంతరం సెప్టెంబర్‌లో వేదికను నిర్ణయించే అవకాశం ఉంది.

## నేరుగా ఓటీటీలోకి సుమంత్ మూవీ.. 'అనగనగా' కొత్త రిలీజ్ డేట్ ఇదే

సుమంత్ హీరోగా రూపొందిన ప్రముఖ ఓటీటీ 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీ 'అనగనగా'. కాజల్ చౌదరి హీరోయిన్. సన్నీ కుమార్ దర్శకత్వం వహించారు. మే 8 నుంచి స్ట్రీమింగ్ కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. మే 15న రిలీజ్ చేస్తున్నట్టు ఓటీటీ సంస్థ సోషల్ మీడియా వేదికగా శనివారం ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రత్యేక వీడియో ఆకట్టుకునేలా ఉంది. 'ప్రతి కథా ఎందుకు 'అనగనగా' అని మొదలవుతుంది?' అని కుమారుడు అడిగిన ప్రశ్నకు హీరో ఇచ్చిన సమాధానం ఆసక్తికరం. ఈ సినిమాలో సుమంత్ ఉపాధ్యాయుడిగా



నటించారు. నేటి విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపడంతోపాటు చిన్నారులకు ఏ విధంగా పాఠాలు బోధిస్తే త్వరగా అర్థమవుతుందో చెప్పే ప్రయత్నం చేసినట్టు కొన్ని రోజుల క్రితం విడుదలైన టీజర్ చూస్తే అర్థమవుతోంది. మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచకూడదని.. కాన్సెప్ట్ నేర్చుకుంటే చాలు మార్కులు వాటంతట అవే వస్తాయనేది ఆ ఉపాధ్యాయుడి నమ్మకం. మరి, ఆయన ప్రయత్నం ఫలించిందా? వీరి కుమారుడు ఎన్ని మార్కులు సంపాదించాడు? తదితర అంశాలతో ఈ సినిమా రూపొందింది.

## వాలుకళ్లతో వయ్యారంగా



అలీనా షాజీ అలియాస్ ఇవానా.. తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తమిళ డబ్బింగ్‌చిత్రం 'ఝూన్సీ'తో అందరి మనసులు దోచేసిన ఈ యంగ్ బ్యూటీ.. లవ్ టుడే సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది. అంతకుముందు 12 ఏండ్ల వయస్సులోనే మలయాళీ చిత్రం మాస్టర్స్ చైల్డ్ ఆర్టిస్ట్ తన యాక్టింగ్ సినీ కెరీర్ ను ప్రారంభించి ఆకట్టుకుంది. దీంతో ఈ భామకు టాలీవుడ్‌లో వరుస ఆఫర్లు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం ఈ చిన్నది శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న 'సింగిల్' మూవీలో చాన్స్‌కొట్టేసింది. ఇక ఈ చిత్రంలో కేతిక శర్మ కూడా హీరోయిన్ గా నటిస్తోంది. గీతా ఆర్ట్స్, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి తదితరులు ఈమూవీని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ.. రెగ్యులర్‌గా ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా లైట్ బ్లూ కలర్ డ్రెస్‌లో లాంగ్ ఇయర్ రింగ్స్, చేతులకు గాజులు, ముఖానికి బొట్టు పెట్టుకుని.. వాలు కళ్లతో వయ్యారంగా చూస్తూ ఫొటోస్‌కి స్టిల్స్ ఇచ్చింది. లేటెస్టుగా ఈ బ్యూటీ ఇన్‌స్టాగ్రామ్ లో షేర్‌చేసిన పిక్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.


# సినిమా

## 'పెద్ది'లో శ్రీలీల



మెగాహీరోరామ్‌చరణ్‌నటిస్తున్నక్రేజీప్రాజెక్ట్ 'పెద్ది'. ఉప్పెన' ఫేమ్ సానా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ సినిమా 1980లో గ్రామీణ ఆంధ్రప్రదేశ్ నేపథ్యంలో రూపొందుతోంది. అయితే తాజాగా ఈమూవీలో ఓ మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నాడట బుచ్చిబాబు. దీని కోసం రామ్ చరణ్ సరసన యంగ్‌బ్యూటీ శ్రీలీల స్టెప్పులు వేయబోతుందట. ఏఆర్ రెహమాన్ కంపోజ్ చేస్తున్న ఒక ఫుల్ ఎనర్జిటిక్ ఐటెం సాంగ్ తో థియేటర్ దద్దరిల్లేలా శ్రీలీల చేయనుందని అంటున్నారు. ఈపాట రామ్ చరణ్ పాత్రకు టర్నింగ్ పాయింట్‌గా ఉండబోతుందన్న టాక్ కూడా వినిపిస్తోంది. అయితే ఇది ఎంత వరకు నిజం ఉందో తేలినప్పటికీ ప్రజంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. మరోవైపు గతేడాది వచ్చిన 'పుష్ప 2'లో శ్రీలీల చేసిన స్పెషల్ సాంగ్ యూత్‌లో జోష్ నింపిన సంగతి తెలిసిందే.

## వీడీ పశ్చాత్తాపం



ఇటీవల జరిగిన 'రెట్రో' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ ఉగ్రవాదులను ఉద్దేశించి మాట్లాడుతూ 'ట్రైబల్స్' అనే పదం వాడారు. అయితే గిరిజనులను అవమానించేలా ఆయన వ్యాఖ్యలు చేశారంటూ తెలంగాణ ట్రైబల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది కిషన్‌రాజ్ చౌహాన్, ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తన వ్యాఖ్యలపై విజయ్ తాజాగా పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేశాడు. 'నేను 'రెట్రో' ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలు కొందరి మనోభావాలను దెబ్బతీసినట్లు నా దృష్టికి వచ్చింది. వీటిపై క్లారిటీ ఇవ్వాలనుకుంటున్నాను. ఏ వర్గాన్నీ, ఏ తెగనూ బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. వారిని నేను ఎంతో గౌరవిస్తాను. భారత దేశంలోని ప్రజలంతా ఒక్కటేనని భావిస్తాను. మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగాలి. నేను ఏ సమూహంపై ఉద్దేశపూర్వకంగా ఎప్పుడూ వివక్ష చూపలేదు. వారందరూ నా కుటుంబ సభ్యులు, నా సోదరులే అని అనుకుంటాను. నేను చేసిన వ్యాఖ్యల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేస్తున్నాను. శాంతి గురించి మాట్లాడడమే నా ఏకైక లక్ష్యం. చారిత్రక, నిఘంటు దృష్టికోణంలోనే నేను ఆ పదాన్ని ఉపయోగించాను. వందల ఏళ్ల కిందట సమాజం, ప్రజలు గుంపులుగా వ్యవస్థీకృతమై ఉండేవాళ్లని నా ఉద్దేశం. అలాంటి సమయంలో రెండు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవి. అంతేకానీ, ఇప్పుడున్న షెడ్యూల్ ట్రైబ్‌ని ఉద్దేశించి నేను వ్యాఖ్యలు చేయలేదు. బ్రిటిష్ వారు భారత దేశాన్ని పాలించడం మొదలు పెట్టిన తర్వాత ఇలా వర్గీకరణ అనేది జరిగింది. అలా జరిగి కనీసం 100 సంవత్సరాలు కూడా పూర్తి కాలేదు' అంటూ వివరణ ఇచ్చాడు.

## దిల్ రాజు 'ఏఐ' స్టూడియో..

**ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్ : ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు చెందిన 'లార్వెన్ ఏఐ' స్టూడియోను మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. స్టూడియో లోగోను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దర్శకులు రాఘవేంద్రరావు, సుకుమార్, నాగ్ అశ్విన్, అనిల్ రావిపూడి, వంశీ పైడిపల్లి, బాబీ, మోహనకృష్ణ ఇంద్రగంటి, వి.వి. వినాయక్ తదితరులు పాల్గొన్నారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "దిల్ రాజుతో నాకెప్పటి నుంచో పరిచయం ఉంది. అధునాతన సాంకేతికతను సినిమాకి జోడించాలన్న దృఢసంకల్పంతో ఆయన ఈ స్టూడియో నిర్మించారు. దిల్ రాజు, ఆయన టీమ్‌కి శుభాకాంక్షలు. ఇక్కడ ప్రదర్శించిన కొన్ని వీడియోలతోనే 'లార్వెన్ ఏఐ'



స్టూడియో ఎలాంటిదో అందరికీ అర్థమై ఉంటుంది. టెక్నాలజీ విషయంలో మనం లీడర్స్ అని ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైంది. లార్వెన్ స్టూడియో.. మన తెలంగాణ, హైదరాబాద్‌కు మరింత పేరు తీసుకొస్తుందనుకుంటున్నా. కథను చెప్పడం నుంచి సినిమా పంపిణీ వరకూ అంతా ఏఐ ద్వారా చేయొచ్చు. ఇప్పటికే ఎన్నో హాలీవుడ్ మూవీస్, తెలుగు సినిమా 'కల్కి' టీమ్స్ ఏఐను వినియోగించాయి. చిత్ర పరిశ్రమలో ఏఐ మార్పులు తీసుకొస్తుంది. మార్పును స్వాగతిస్తూ లీడ్ తీసుకునే వారే లీడర్ అవుతారు" అని పేర్కొన్నారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD.
PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net
Mobile No. 98660 19778, 89789 60131.